www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 డిసెంబరు 2022
5
ఏలూరు



తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాండూస్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం సహా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం చాలాచోట్ల తడిసిందని తెలిపారు. అసలే తేమ శాతం, గోనెసంచుల కొరత, రవాణా సమస్యలతో ధాన్యం అమ్మకాలు జరగక రైతాంగం ఇబ్బంది పడుతోందని, దీనికి తోడు మాండూస్ తుపానుతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలులో ఆలస్యం వల్ల ధాన్యం తడిసిపోయిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. అదేవిధంగా తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

వైద్యం దారితప్పే..!

- ఏలూరు జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి దారుణం
- మెడికల్ కళాశాలగా మారుతున్నా అందని సేవలు
- 450 బెడ్ల నుంచి 350కు కుదింపు
- సీనియర్ డాక్టర్లు మొత్తం బదిలీ
- అత్యవసర కేసులన్నీ విజయవాడకు రిఫర్
- ఎవరు విధుల్లో ఉంటారో తెలియని పరిస్థితి
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి మెడికల్ కళాశాలగా మారడం ప్రజలకు ఉపయోగకరమో.. నష్టదాయకమో అర్థంకాని దుస్థితి నెలకొంది. మెడికల్ కాలేజీ వస్తే మరిన్ని వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఇప్పటి వరకూ కొనసాగిన వైద్యసేవలు సైతం అందకుండా పోతున్నాయి. జనరల్ ఆసుపత్రిగా మారిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఆసుపత్రి అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడడం, అందరిని సరైన క్రమంలో నడపడంలో విఫలం కావడంతో పరిస్థితి దారుణంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రోజుకు వెయ్యి నుంచి 1200 మంది అవుట్ పేషెంట్‌లు వస్తుంటారు. 450 బెడ్స్ అందుబాటులో ఉండేవి. ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఇబ్బందికర కేసులన్నింటినీ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తారు. ప్రస్తుతం అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్స్ అందుబాటులోకి రాకుండానే సీనియర్ డాక్టర్లను వేర్వేరు ఆసుపత్రులకు బదిలీచేశారు. దీంతో ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. జూనియర్ డాక్టర్లతోనే నెట్టుకొస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, పాయిజన్, పాముకాటు వంటి కేసులను సైతం విజయవాడ లేదా గుంటూరుకు రిఫర్ చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. ఏదైనా అత్యవసర కేసులైతే మాత్రమే విజయవాడకు రిఫర్ చేసేవారు. ఇదేమని అడిగితే బెడ్స్ లేవంటూ డ్యూటీ డాక్టర్ సమాధానం చెబుతున్నారు. దీంతో రోగుల పరిస్థితి దారుణంగా మారింది. జనరల్ ఆసుపత్రిగా మారినట్లు కాగితాల్లో తప్ప వైద్యసేవలు మాత్రం అందించడం లేదు. స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది. వైద్యసేవలు జనాలకు మరింతగా అందేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్స్ కాన్సెప్ట్ తీసుకురాగా, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పూర్తిగా దారితప్పుతున్నాయి. గైనకాలజీ విభాగంలోనూ సీనియర్ డాక్టర్లు వెళ్లిపోవడంతో వైద్యసేవలు సరిగా అందక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎక్స్‌రే తీస్తే రిపోర్ట్ రోగులకు ఇచ్చేవారు. ఇప్పుడు డాక్టర్ల గ్రూపులో పెట్టి అక్కడకు వెళ్లాలని చెబుతున్నారు. తీరా అక్కడకు వెళితే వారు సరైన సమాధానం చెప్పడం లేదని రోగులు వాపోతున్నారు. రోగులకు తమ ఎక్స్‌రే రిపోర్ట్ చూసుకునే పరిస్థితి కూడా లేకుండా చేశారు.

ఎప్పుడు ఏ డాక్టర్ ఉంటారో తెలియని అయోమయం..

ఏలూరు జనరల్ ఆసుపత్రిలో వైద్యులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియడం లేదంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా రోగి ఓ డాక్టర్ వద్ద చూపించుకుని మందులు తీసుకుని వెళ్తే రెండోసారి మందులకు వచ్చేసరికి ఆ డాక్టర్ కనిపించడం లేదు. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. దీంతో ఆ రోగి ఆసుపత్రి అంతా తిరిగితిరిగి అలసిపోతున్నాడు. వేరే డాక్టర్ వద్దకు వెళితే ముందు చూసిన డాక్టర్‌నే కలవాలంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో రోగులకు వేరే గత్యంతరం లేక మళ్లీ ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆసుపత్రి పర్యవేక్షణ అధికారులు తమకు ఏమీ సంబంధంలేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఏలూరు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు. అత్యవసర కేసులకు వైద్యం అందేవిధంగా చూడాలని అంతా వేడుకుంటున్నారు. సీనియర్ డాక్టర్లను నియమించి వైద్యసేవలందించాలని అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.


వినతిని అందిస్తున్న నాయకులు

గిరిజన విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెఆర్.పురం ఐటిడిఎ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యారంగ సమస్యలపై 18సార్లు అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, అక్టోబర్ 15 నుంచి 22 వరకూ అన్ని ఐటిడిఎ ఆశ్రమ పాఠశాలలకు జీపుజాతా నిర్వహించి, నవంబర్ 20వ తేదీన రాష్ట్రస్థాయి సదస్సు పాడేరులో జరిగిందని చెప్పారు. సదస్సు అనంతరం అధికారులకు సమస్యలపై వినతి పత్రం ఇచ్చినా ఇంతవరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, ప్రభుత్వం గిరిజన విద్యారంగ సమస్యల పట్ల తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎపి గిరిజన సంఘ నాయకులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యారంగంలో జిఒ మూడును సుప్రీంకోర్టులో కొట్టివేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ జిఒకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నం చేయకపోవడం వల్ల గిరిజన ఉపాధ్యాయ నియామకాలు, ప్రమోషన్లు రకరకాల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిపై ప్రభుతవం స్పష్టమైన వైఖరి కూడా తీసుకోవడం లేదన్నారు. అప్ గ్రేడేషన్, డిప్యూటీఇఒ పోస్టులు, జూనియర్ కాలేజీల స్థాపన, అధ్యాపకుల నియామకం వంటివి సందిగ్ధంలో పడ్డాయన్నారు.

సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ ఊసే లేదని, భాషా వాలంటీర్లకు బడ్జెట్ కేటాయించినా, నియామకాలు లేవని, ఇలా ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం గిరిజన విద్యారంగానికి సంబంధించి వస్తున్న సమస్యలు పరిష్కరించకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ఉపాధ్యాయులు గిరిజన విద్యార్థి సంక్షేమ శ్రేయోభిలాషులు ఖండించాలన్నారు. ఈ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్.సుధారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనదుర్గ, జీలుగుమిల్లి ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, కుక్కునూరు మండల ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ముషబ్బర్, కొయ్యలగూడెం మండల ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వర్, యుటిఎఫ్ నేతలు షేక్ బాజీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సిఐటియు రాష్ట్ర మహాసభను

విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు ఏలూరు జిల్లా కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. సిఐటియు జిల్లా కమిటీ సమావేశం స్థానిక కొత్తబస్టాండ్ వద్ద గల సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన 50 ఏళ్ల తర్వాత ప్రప్రథమంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఈ రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. ఆతిథ్యానికి పెట్టింది పేరు గోదావరి జిల్లా అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మంది ఎంపికైన ప్రతినిధులు మూడు రోజుల పాటు మహాసభలో పాల్గొంటారన్నారు. మొదటి రోజు 50 వేల మందితో కార్మిక భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. మహాసభ జయప్రదానికి, రాష్ట్రం నలుమూలల నుండి హాజరయ్యే ప్రతినిధులకు భోజనం, వసతి ఏర్పాట్లకు జిల్లాలో ఉన్న ఉద్యోగ, కార్మిక వర్గం, ప్రజానీకం, దాతలు, శ్రేయోభిలాషులు విరాళాలిచ్చి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, హక్కుల కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం, ఉద్యోగ వర్గం మీద చేస్తున్న దాడులను తిప్పికొట్టేందుకు ఈ మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి ఏలూరు జిల్లా కమిటీ పెద్ద ఎత్తున సహకరించాలని, సభకు జన సమీకరణ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా నాయకులు బి.సోమయ్య, జి.రాజు, ఆర్‌వి.సత్యనారాయణ, నాగమణి, సుభాషిణి, విజయలక్ష్మి, హైమావతి, వెంకటరమణ, వెంకటరావు, సాయిబాబు, రాంబాబు, రమణారావు, సుధాకర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కోర్టు ఉద్యోగాల భర్తీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జడ్జి మంగాకుమారి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోర్టు ఉద్యోగ నియామకాలను అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా భర్తీ చేయనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి స్పష్టం చేశారు. స్థానిక జిల్లా న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరితో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి మాట్లాడారు. హైకోర్టుతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఉద్యోగాల భర్తీ విషయంలో కొంతమంది మోసపూరితమైన చర్యలకు పాల్పడుతున్నట్లు హైకోర్టు వారి దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3432 ఉద్యోగాలకు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 240 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఈ నెల 21 నుంచి వచ్చేనెలా రెండో తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా ఉద్యోగ నియామకాలను చేపట్టినట్లు చెప్పారు. కొంతమంది కోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని, వారి విషయాన్ని హై కోర్టు వారు తీవ్రంగా పరిగణిస్తున్నారని చెప్పారు. ఇటువంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారి వివరాలను కోర్టు దృష్టికి తీసుకురావాలని, చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షిస్తామని తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాలు హైకోర్టు వారు అత్యంత కట్టుదిట్టంగా ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిభ ఆధారితంగా అభ్యర్థులను నియమిస్తామని తెలిపారు. ఉద్యోగాల భర్తీలో ధనం, సిఫార్సులకు తావులేదని, కేవలం పూర్తిగా అభ్యర్థి స్వశక్తి సామార్థ్యాలపైనే ఆధారపడి ఉందని చెప్పారు. పరీక్షల్లో మెరిట్ వచ్చినవారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయని ఆమె స్పష్టం చేశారు.



విద్యార్థిని కావ్యశ్రీలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

వెయిట్ లిఫ్టింగ్‌లో 'ఎన్ఆర్ఐ' విద్యార్థికి పతకాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఇటీవల గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర యువజన జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరు ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డిగ్రీ విద్యార్థి యు.కావ్యశ్రీలక్ష్మి వెండి, రజిత పతకాలు సాధించినట్లు కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల లభ్యతలో ప్రాధాన్యత పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్‌ఎన్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ జి.సంజీవరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఒల నిరసన


చింతలపూడిలో...


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పని ఒత్తిడి కారణంగా చనిపోయిన గ్రామ రెవెన్యూ అధికారుల కుటుంబాలకు న్యాయం చేయాలని, రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని విఆర్ఒలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విఆర్ఒలు మాట్లాడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు 658 జిఒ ప్రకారం వెంటనే ఉద్యోగం ఇవ్వాలని కోరారు. విఆర్ఒలు చనిపోతే వారి కుటుంబానికి ఇప్పటివరకు కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేదన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. విఆర్ఒలకు అవసరమైన కంప్యూటర్ సిస్టమ్స్ స్టేషనరీ ఇవ్వాలన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే విఆర్ఒలు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెలవు రోజుల్లో, పండుగ రోజుల్లో విఆర్ఒలకు విధులు అప్పగించకుండా ఆదేశాలు జారీ చేయాలన్నారు. జిల్లా, డివిజన్ కేంద్రాల్లో జరిగే సమావేశాలకు విఆర్ఒలను పిలవకుండా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కొంతమంది అధికారులు గ్రామ రెవెన్యూ అధికారులను ఇష్టం వచ్చినట్లు తిడుతూ పుడుపడితే అప్పుడు కార్యాలయానికి హాజరు కావాలని చెప్పడంతో మానసికంగా శారీరకంగా బాధపడుతున్నామని విఆర్ఒలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న విఆర్ఒ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం మండలంలోని విఆర్ఒలు పాల్గొన్నారు.

చింతలపూడి : పని ఒత్తిడి కారణంగా చనిపోయిన గ్రామ రెవెన్యూ అధికారులకు రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందించాలని తహశీల్దార్ కృష్ణజ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు శ్రీను, గోపి, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఒ సంఘం జంగారెడ్డిగూడెం డివిజనల్ అధ్యక్షులు అడపా రాంబాబు ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విఆర్ఒలకు పని ఒత్తిడి తగ్గించాలని, పని ఒత్తిడి కారణంగా చనిపోయిన విఆర్ఒల కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. విఆర్ఒల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో విఆర్ఒ సంఘం మండల అధ్యక్షుడు ఏసుబాబు, ఉపాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ముసునూరు :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షులు పి.శోభన్‌బాబు, నూజివీడు డివిజన్ సెక్రటరీ ఎన్.మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దార్ దాసరి సుధకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులకు పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విఆర్ఒల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు హరిబాబు, ఎం.యశోధమ్మ, బి.రవి, శోభన్‌బాబు, మస్తాన్‌రావు, పి.నవీన్ పాల్గొన్నారు.

భీమడోలు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ అధికారులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ రెవెన్యూ సంఘ భీమడోలు శాఖ అధ్యక్షులు కెడివి.ప్రసాద్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్‌కు అందించారు.


కొయ్యలగూడెంలో...


ధాన్యం పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ధాన్యం కొనుగోలు లక్ష్యం కుదింపు దారుణం

సిపిఎం ఆధ్వర్యాన రైతులు నిరసన

ప్రజాశక్తి - పెదపాడు

రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో పెదపాడులో పర్యటించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. రహదారుల నిండా ధాన్యం రాసులున్నాయని, ఎప్పుడు కొనుగోలు చేస్తారంటూ రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఆరబెట్టిన ధాన్యం ప్రస్తుత వర్షానికి తేమ శాతం పెరిగిపోయిందని అన్నదాతలు సిపిఎం నాయకుల వద్ద వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మాండూస్ తుపాన్ వల్ల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయి, తేమ శాతం పెరిగి అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 17 శాతం వరకూ ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోవడం వల్ల తుపానుకు నష్టాలకు గురికావాల్సి వచ్చిందని చెప్పారు. పెదపాడులో 500 ఎకరాల్లో వరి పండించగా ఇప్పటికి 50 శాతంపైగా వరి కోతలు పూర్తయ్యాయని, ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందన్నారు. 70 ఎకరాల్లో ధాన్యం అమ్మినా నేటికీ రైతులకు డబ్బులు అందలేదని మండిపడ్డారు. మరో 70 ఎకరాల్లో ధాన్యం కల్లాల్లోనే ఉందన్నారు. వీటిని తడవకుండా రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు పరదాలు కప్పి కాపాడుకుంటున్నారని తెలిపారు. గోనె సంచుల కోసం, ధాన్యం రవాణాకు లారీల కోసం రైతులు కాళ్ల చెప్పులు అరిగేలా కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం కుదించడం వల్ల రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం కుదించడం దారుణమని విమర్శించారు. రైతు పండించిన ప్రతి గింజనూ కొంటామని ప్రచారం చేసి ఇప్పుడు లక్ష్యం మేరకే ధాన్యం కొంటామని, మిగిలిన ధాన్యాన్ని ప్రయివేటు వారికి అమ్ముకోవాలని సివిల్ సప్లయిస్ రాష్ట్ర కమిషనర్ ప్రకటించడం ఇదేనా దళారీ వ్యవస్థ నిర్మూలన అని ప్రశ్నించారు. తుపాన్ నేపథ్యంలో తేమ శాతం నిబంధన సడలించాలన్నారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.కిషోర్, పి.రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, కరీముల్లా పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - చాట్రాయి

తమకు బకాయి వేతనాలు ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన ఆరుగురు పారిశుధ్య కార్మికులు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నెలకు రూ.ఆరు వేల జీతానికి అప్పటి ఎంపిడిఒ నాగేశ్వరరావు తమను పారిశుధ్య కార్మికులుగా నియమించారని చెప్పారు. మొదట రెండు నెలల జీతం ఇచ్చారన్నారు. తమకు ఇంకా 39 నెలల జీతం రూ.14 లక్షలు రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. 15 రోజుల్లో కార్మికుల జీతాలు ఇవ్వకుంటే సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అమరణ నిరాహార దీక్ష చేస్తామని పారిశుధ్య కార్మికులు విస్సంపల్లి రమేష్, కారుమంచి భిక్షాలు, మొద్దు మరియమ్మ, విస్సంపల్లి ప్రసాదరావు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ నాయకత్వం వహించారు.

'క్లాప్'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ షేక్‌షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్లాప్ నిర్వహణను నూరుశాతం అమలు చేయాలని కమిషనర్ షేక్ షాహిద్ పిలుపునిచ్చారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో క్లాప్ వారోత్సవాల నిర్వహణను సోమవారం సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం ఎన్‌జిటి ఆదేశాలు అనుసరించి క్లాప్ నిర్వహణ జరుగుతుందన్నారు. మన ఇంటిలోనే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి ఆయా ప్రాంతాల ప్రజలు క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. రోడ్లు, కాలువలు, డ్రెయినేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా స్వచ్ఛ ఏలూరుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అన్నారు. ఇంటి వద్దనే చెత్తను కంపోస్టింగ్ ద్వారా పెరటి మొక్కల పెంపకానికి ఎరువులు తయారు చేసుకోవాలన్నారు. స్వచ్ఛ నగరంగా ఏలూరును తీర్చిదిద్దడానికి పారిశుధ్య విభాగం అధికారులు కాకుండా నగర ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అనంతరం క్లాప్ వాహన సిబ్బందికి డస్ట్ బిన్‌లు, గ్లౌజులు అందించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏడు రోజుల పాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. అనంతరం ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను మేయర్ ఆవిష్కరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ట్రాలీ బిన్స్, గ్లౌజులు మేయర్ అందించారు. 600 ట్రాలీ బిన్స్, గ్లౌజులు శానిటేషన్ సర్కిల్స్‌కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశీ శ్రీనివాస్, ఎన్.సుధీర్ బాబు, నగరపాలకసంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, కమిషనర్ షేక్ షాహిద్, కార్పొరేటర్లు, నగరపాలకసంస్థ అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యునిగా తుమ్మల సత్యనారాయణ

ప్రజాశక్తి - టి.నరసాపురం


సత్యనారాయణ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా టి.నరసాపురం మండలానికి చెందిన తుమ్మల సత్యనారాయణ ఎంపికైనట్లు సోమవారం విలేకర్లకు తెలిపారు. జిల్లా కమిటీ, మండల కమిటీల్లో చురుకుగా పనిచేస్తున్న ఆయనను ఇటీవల జంగారెడ్డిగూడెంలో జరిగిన 29వ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో రైతుల వద్ద నుంచి ఐదు శాతం రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని గణపవరం తహశీల్దార్ ఎం.సన్యాసిరావు చెప్పారు. వర్షాల వల్ల ధాన్యం రంగు మారడంతో అధికారులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన పడుతున్న తరుణంలో తహశీల్దార్ సన్యాసిరావు ప్రజాశక్తితో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతాంగం ఆందోళన పడవద్దన్నారు. ధాన్యం ఐదు శాతం రంగు మారినప్పటికీ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు వారి బ్యాంకు ఖాతాలో సొమ్ములు జమ అవుతాయని చెప్పారు.


ఆర్ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న శ్రీనివాస్

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం


ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని ముగ్గళ్ల గ్రామంలో స్థానిక పంచాయతీ విర్బక్ హెల్త్ ఇండియా సంస్థ ఆధ్వర్యాన నిర్మించిన ఆర్ఓ ప్లాంటును గ్రామ పెద్దలు పెంటిబోయిన శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పి.నిర్మల మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఆర్ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా జాన్ ములగాడ జయంత్యుత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో కళాశాల ఫౌండర్ మోస్ట్ రెవరెండ్ లేట్ బిషప్ జాన్ ములగాడ 85వ జయంతోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు పీఠంలోని పలువురు గురువులు జాన్ ములగాడ చిత్రపటానికి నివాళులర్పించారు. జాన్ ములగాడ జన్మదినోత్సవం సందర్భంగా కళాశాలలో క్రీస్తు పుట్టుక వేడుక సంబంధించిన పశువుల పాకను కళాశాల ఛైర్మన్ మోస్ట్ బిషప్ జయరావు పొలిమేర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జాన్ ములగాడ సేవలను గుర్తు చేసుకుని ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం జనరల్ ఫాదర్ పి.బాల, ఏలూరు పీఠం ఛాన్సలర్ ఫాదర్ బాబు జార్జ్, కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జి.మోజెస్, ఏలూరు పీఠంలోని పలువురు గురువులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల మృతి చెందిన మాగాపు నాగేశ్వరరావు కుటుంబానికి పట్టణ కాపు సేవా సంఘం, కాపు సంక్షేమసేనల ఆధ్వర్యంలో పెద్దలు సోమవారం రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. పరింపూడి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద అయిన మృతుడు నాగేశ్వరరావు తాడేపల్లిగూడెం రోడ్డులోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని సంఘ పెద్ద, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి తాడికొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. నాగేశ్వరరావు మృతికి సంతాపం ప్రకటించి కుటుంబానికి ప్రభుత్వం తరపున కూడా అండగా నిలబడతామని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి తాగుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన వ్యక్తి గంజాయి తాగుతుండగా అరెస్టు చేసినట్లు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అజరయ్యపేటలో దాడి చేసి గంజాయి తాగుతుండగా వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టణ పరిసరాల్లో గంజాయి క్రయవిక్రయాలు, సరఫరా వంటి విషయాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. పట్టణ సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తిని, ఎస్ఐ శివ నారాయణని, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రశంసించారు.

చోరీ కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ఎన్ఎస్‌పి కార్యాలయంలో రికార్డుల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 26వ తేదీన ఎన్ఎస్‌పి కార్యాలయం సమీపంలోని గోడౌన్‌లో రికార్డులు చోరీ జరిగినట్లు తెలిపారు. ఆరు బస్తాల మేర చోరీకి గురైన రికార్డులను దశల వారీగా పాత దుకాణంలో నిందితులు విక్రయించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ప్రత్యేక బృందాల ఏర్పాటుతో సేకరించిన ఆధారాల మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. చోరీకి గురైన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లుగా స్పష్టం చేశారు. ఈ కేసును చాకచక్యంగా చేదించిన పట్టణ సిఐ ఎంవివివిఎస్ఎన్.మూర్తిని ఎస్ఐ శివ నారాయణను, పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అశోక్‌కుమార్ ప్రశంసించారు.

గోడ కూలి వ్యక్తి మృతి


ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటి గోడ కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుడ్లపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపోతేపల్లి పంచాయతీ పరిధిలోని గుడ్లపల్లి గ్రామానికి చెందిన మద్దిపాటి దుర్గారావు(50) ఆదివారం సాయంత్రం గుడ్లపల్లి గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం పనులు చేస్తుండగా ప్రమాదవశాస్తూ గోడ కూలి మీద పడింది. దీంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు సహకారంతో దుర్గారావును హాస్పటల్‌కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిబంధనలు.. రైతుకు నష్టాలు

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం తరలింపులో జాప్యం, రవాణా కోసం వాహనాలు సిద్ధం చేయటంలో అధికారుల వైఫల్యం వెరసి తమను నష్టపరిచాయని భీమడోలు మండలానికి చెందిన రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పైరు కోసి, ధాన్యాన్ని తేమశాతం నిబంధనలకు అనుగుణంగా సిద్ధం చేసేందుకు రైతులు (సామూహిక కల్లాలు లేనికారణంగా) జాతీయ రహదారిపై ఆరబెట్టారు. ఆ తరువాత తేమ శాతాన్ని ఖరారు చేసిన అధికారులు ధాన్యం రవాణా చేసేందుకు బస్తాలను అందించారు. రైతులు వాటిని బస్తాల్లో భద్రపరిచి రవాణాకు సిద్ధం చేశారు. కానీ అవసరాలకు సరిపడా రవాణా వాహనాలు రాని కారణంగా ధాన్యం ఎగుమతి నిలిచిపోయింది. ఇదే నేపథ్యంలో రైతులు సొంతంగా ధాన్యం రవాణాకు ముందుకు వచ్చినప్పటికీ సదరు సొమ్ములు మండలానికి ధాన్యం రవాణా వాహనాలను సరఫరా చేసే గుత్తేదారు ఖాతాకు జమవుతున్న కారణంగా రైతులు ధాన్యం రవాణా కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఆసక్తి కనపరచలేదు. ఇదిలా ఉంటే తుపాను కారణంగా మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ధాన్యం రవాణాకు సిద్ధం చేసిన బస్తాలపై బరకాలు వేవారు. నిరంతరంగా కురుస్తున్న వర్షం సోమవారం ఆగింది. దీంతో రవాణాకు సిద్ధం చేసిన ధాన్యాన్ని పరిశీలించగా బస్తా కింది భాగంలో నిల్వచేసిన ధాన్యం మొలక రావటం, కొంతమేరకు ధాన్యం రంగు మారిన విషయాన్ని గమనించిన రైతులు సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు కోడూరుపాడు, భీమడోలు, దుద్దేపూడి ప్రాంతాల్లో ఈ తరహాగా రంగు మారిన, మొలక వచ్చిన ధాన్యం కొంతమేర ఉన్నట్లు గుర్తించారు.


మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

దీనిపై స్పందించిన అధికారులు తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే తీసుకువెళ్లేందుకు సంసిద్ధత వెలిబుచ్చారు. మిగిలిన ధాన్యం నిబంధనలకు అనుగుణంగా వచ్చిన తర్వాత మాత్రమే కొంటామని తెలిపారు. ఆ విధంగా మిగిలిన ధాన్యాన్ని. బస్తా ఒక్కింటికి రూ.500 కూడా దళారులు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. దీంతో రంగు మారిన, మొలక వచ్చిన ధాన్యంతో రైతులు పూర్తిస్థాయిలో నష్టపోతున్నారు. భీమడోలు రైల్వే గేట్ సమీపంలో ఒక రైతు నాలుగు ఎకరాల వచ్చిన సుమారు 12 ధాన్యాన్ని రవాణాకు సిద్ధం చేయగా రంగు మారిన, మొలక వచ్చిన మూడు టన్నుల ధాన్యం అధికారులు తీసుకోవటం లేదని రైతు ఆరోపించారు. దీనిపై అధికారులను వివరణ కోరగా నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని తాము కొనుగోలు చేస్తామని, మిగిలిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా సిద్ధమయ్యేంతవరకు ఆర పెట్టాలని అధికారులు రైతులకు సూచించారు. రానున్న మూడు రోజుల్లో అల్పపీడనం కారణంగా వానలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ఇది సాధ్యమా రైతులు ప్రశ్నిస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని లోపూడి, చక్కపల్లి, వలసపల్లి గ్రామాల్లో ధాన్యాన్ని సొసైటీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారుల ద్వారా తేమ శాతం లేకుండా ఉండేలా చూసి, రైస్ మిల్లర్లలకు చక్కపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా తోలుతున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి చేబత్తిన శ్రీనివాసరావు తెలిపారు.


లోపూడిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

కొయ్యలగూడెంలో 'మాటా - మంతి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వంటగ్యాస్ సిలిండర్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు బతికే పరిస్థితి లేదని టిడిపి రాష్ట్ర మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆదేశాల మేరకు కొయ్యలగూడెంలో సోమవారం మాటా-మంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతులను చేసి తద్వారా జగన్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జగన్ ప్రభుత్వ హయాంలో మహిళలు ఎలా ఉన్నారనే విషయాలను ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. మహిళా చైతన్యమే లక్ష్యంగా మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు మహిళలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు కాకి లక్ష్మి, చెరుకూరి రమ్య, ఆకుల విజయ, కె.లక్ష్మి పాల్గొన్నారు.

కష్టపడితేనే మంచి ఫలితాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, కష్టపడితేనే మంచి ఫలితాలు వస్తాయని చింతంపల్లి సర్పంచి రామకృష్ణ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ఆవరణలో సీతానగరం చింతంపల్లి గోద్రేజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ వారిచే గోద్రేజ్ గ్లోబల్ వాలంటీర్ వీక్స్ అనే ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోద్రేజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ సిబ్బంది, సీతానగరం వైస్ ప్రెసిడెంట్ గుమ్మడపు గోపి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొరగుంటపాలేనికి చెందిన వెంకటేశ్వరరావు ఇంటిలో సోమవారం తెల్లవారుజామున గ్యాస్ లీకై మంటలు చెలరేగి పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంటిలో వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. బాధితులు కట్టువస్త్రలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి వెళ్లి బాధితులను పరామర్శించారు. తక్షణ సాయంగా వంట సామగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులు, చీరలు, దుప్పట్లు అందించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, వైసిపి నాయకులు బొర్రా శేష బాబు, కె.విష్ణువర్ధన్, సాయి, సతీష్ పాల్గొన్నారు. టిడిపి నాయకులు కొడాలి వినోద్ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు.


అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం : మండలంలోని దేవులపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దళిత కుటుంబానికి నారా లోకేష్ రాష్ట్ర సేవా సమితి వ్యవస్థాపకులు అకుమర్తి రామారావు సాయం అందించారు. సోమవారం టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షతన అగ్ని ప్రమాద బాధితురాలు గందిపాము నాగమణికి రూ.ఐదు వేల నగదు, చీరలు, దుప్పట్లు, వంట సామగ్రి, 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు సింహాద్రి రవి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు, పాతూరి రామచంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దళితులను విస్మరించిన వైసిపి'

ప్రజాశక్తి - ముసునూరు


దళిత బడుగు బలహీన వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని అన్ని రంగాల్లో అణగతొక్కుతున్నారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం, గుల్లపూడి, వలసపల్లి గ్రామాల్లో సోమవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల వైసిపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఆర్థికంగా సామాజికంగా సుమారు 25 ఏళ్లు వెనుకబడ్డారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్‌లో నిధులు లేకుండా చేసి వేరు పథకాలను దారి మళ్లించారన్నారు. నిరుద్యోగం లేకుండా చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, సర్పంచి పులివల్ల లక్ష్మీసత్యనారాయణ, టిడిపి మండల నాయకులు కొల్లి గంగారామ్, మెదరమెట్ల సురేంద్ర, మందలపు ధర్మరాజు, పాకనాటి సీతారాం, మసిముక్కు సుబ్బారావు, బర్మ శ్రీనివాసరావు, ఉలాస శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

'డ్రగ్స్ నియంత్రణలో వైసిపి విఫలం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

మత్తుపదార్థాలను అరికట్టడంలో వైసిపి విఫలమైందని పోలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్ర విమర్శించారు. మత్తు పదార్థాలను అరికట్టాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను ప్రోత్సాహస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిన సురేష్, దేవరపల్లి రంగారావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.


టి.నరసాపురంలో...


కొయ్యలగూడెం : యువత చెడు అలవాట్లకు బానిసలు అవుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు నల్లూరి గోపికృష్ణ అన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి చందు, పోలవరం నియోజకవర్గ అధ్యక్షులు గన్ని సురేంద్ర పిలుపుమేరకు కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలవుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బివి.రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల యువత అధ్యక్షులు శివంగి సుమంత్ కుమార్, ఆరేటి వీరపండు, కంటమణి రాజేంద్ర, చిడిపి రవి, బొబ్బర రాజు, రాజేష్, చంద్రం, గంగుల నాగు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి - చింతలపూడి

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని ఎండపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను ప్రజలకు వివరించి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీని సందర్శించి నూతనంగా ఏర్పాటుచేసిన మంచినీటి మోటర్‌ను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచి ఎడ్ల మోహనరావు, వైస్ ఎంపిపి గుత్తా కిషోర్, చల్లబత్తుల శ్రీనివాసరావు, అబ్బయ్య, మందలపు సాయిబాబా, ముసునూరు వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కృష్ణ జ్యోతి, ఎపిఎం వెంకాయమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సిబ్బందితో కలిసి ఎంపిడిఒ ఎన్.తిరుపతిస్వామి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. అనంతరం గర్ల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, సామంత పూడి సూర్యనారాయణ, మొడియం రామతులసి, కోలుం హేమకుమారి, మండల కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, బుగ్గా మురళి, అల్లూరి రత్నాజీ, మొల్లం వసంతరావు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రంలో నూతన అధ్యాయాన్ని సృష్టించిందని, స్వర్ణ యుగ సాధనకు సాక్ష్యంగా నిలిచిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని అన్నారు. కొయ్యలగూడెం గణేష్‌సెంటర్‌లో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శత దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉండి మాజీ ఎంఎల్ఎ, పార్టీ పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ పాతపాటి సర్రాజు, చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా బాలరాజును అభినందించారు. అనంతరం పార్టీ నేతలు గజమాలతో ఆళ్లనానిని, బాలరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిపిలు గంజిమాల రామారావు, సుంకర వెంకటరెడ్డి, కారెం శాంతి, డి.లక్ష్మి పాల్గొన్నారు.

నిరుపేదలకు సత్వర వైద్య సేవలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరుపేదలకు సత్వర వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని చిగురుకోటలో సోమవారం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి సొంతూరులో ప్రాథమిక వైద్య చికిత్సలు, పరీక్షలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పేరం నాగలక్ష్మి, కె.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 220/2021, O.S. 175/2021

Between:
పిటీషనరు (వాది):
శ్రీమతి పోతుల రత్నకుమారి
Vs
రెస్పాండెంటు (ప్రతివాది):
శ్రీ రేలంగి హరి నారాయణరావు
To:
రెస్పాండెంటు/ ప్రతివాది:
శ్రీ రేలంగి హరి నారాయణరావు, S/o. వెంకట సత్యనారాయణ, డో.నెం. 3-95ఎ, నూతనగూడెం, పోలవరం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా, JRG JCJC Limits.

పై నెంబరు Declaration దావాలోనూ మరియు టెంపరరీ ఇంజంక్షన్ పిటీషను I.A. 220/2021 లలో మీకు ఎన్ని పర్యాయములు Batta కట్టిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి దివి. **19-12-2022 ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితూ మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా: 19-12-2022

కె.వి.వి.హరిమోహన్, అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
12-12-2022 సెల్:9160061613

ఇంటి స్థలం డాక్యుమెంటు పోయినవి

రావూరి మాధురి ప్రియదర్శిని అనే నేను కన్నాపురం నుండి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గ మధ్యలో నా ఇంటి స్థలం **డాక్యుమెంట్ నెంబర్ 3391/2015** మార్గమధ్యలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ ఫోన్ నెంబర్‌కు చేయగలరని కోరుచున్నాము.

ఇట్లు
రావూరి మాధురి ప్రియదర్శిని
ఫోన్: 9502470589
జంగారెడ్డిగూడెం వైష్ణవి నర్సింగ్‌హోమ్
శ్రీనివాసపురం రోడ్డు,
ఏలూరు జిల్లా

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు అడిషనల్ జుడీషియల్ 1st క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
E.P. 19/2022 in O.S. 305/2018

బిట్వీన్:
కరుటూరి రామకృష్ణ ...*DHR/ వాది*
మరియు
దేవా బాలకృష్ణ ...*DHR/ప్రతివాది*
JDR: దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, వయస్సు 48 సం॥లు, డో.నెం. 3-45, వ్యాపారం, జగన్నాధపురం, TPG PJCJ.

పై నెంబరు గ్రంధమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్ననూ మీరు సదరు నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై గ్రంథంలో ది. 6-1-2023వ తేదీ అయి వున్నది. కావున సదరు వాయిదాకు మీరు గానీ, మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 06-1-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం జరుపబడును అని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ముళ్ళపూడి శ్రీనివాసరావు, అడ్వకేటు
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
12-12-2022 సెల్:9491978178

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం. 49/2012 ఇన్ ఒ.యస్. నెం. 84/2008

బిట్వీన్:
శ్రీ మారిశెట్టి వెంకటేశ్వరరావు (died) మరియు మరి కొందరు ...*డి. హెచ్. ఆర్‌లు*
&
శ్రీ పులి లక్ష్మయ్య (died) మరి కొందరు ...*జె. డి. ఆర్‌లు*

పైన పేర్కొన్న డిక్రీ హోల్డరు జె.డి.ఆర్‌లపై డిక్రీ పొంది డిక్రీ వసూలు నిమిత్తము షెడ్యూలు స్థిరాస్తిని అమ్మి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుచూ శ్రీ కోర్టు వారి ఎదుట ఇ.పి. దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు షెడ్యూలు స్థిరాస్తిని వేలం పాట ద్వారా అమ్ముటకు ది. 02-01-2023 సం॥ తేదీ నిర్ణయించినారు. వేలం పాటలో పాల్గొని షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు యిష్టత ఉన్నవారు **ది. 02-01-2023 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి పాట పాడుకొని కొనుగోలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల నారాయణపురం గ్రామపంచాయతీలో గల డోర్ నెం. 1-89, 200 చదరపు గజముల తాటియాకుల ఇంటికి సరిహద్దులు.
తూర్పు: శ్రీ దొడ్డిగర్ల ముసలయ్య గారి ఇల్లు.
దక్షిణం: రోడ్డు.
పడమర: శ్రీ కొమ్మిన ముసలయ్య గారి ఇల్లు స్థలం.
ఉత్తరం: శ్రీ మార్లపూడి బంగారయ్య గారి పెంకుటిల్లు, స్థలం.
పై హద్దుల మధ్య గల 200 చ॥గ॥ స్థలములో తాటియాకుల ఇల్లు స్థలము యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.
డి. హెచ్. ఆర్. వాల్యూ: రూ. 1,25,000/-
అమీనా వాల్యూ: రూ. 10,00,000/-
జె. డి. ఆర్. వాల్యూ: రూ. 10,00,000/-

కొండేపాటి వెంకటేశ్వరరావు, అడ్వకేటు
తాడేపల్లిగూడెం, సెల్: 9848355344